# ఆస్పత్రుల్లో భద్రత డొల్ల!

**-ఇరుకు గదుల్లో పలు ప్రైవేట్ దవాఖానాలు**
**-ఇష్టారాజ్యంగా వైద్య చికిత్సలు**
**-తనిఖీలను విస్మరించిన అధికారులు**




**హైదరాబాద్, జూన్ 23 ప్రభాతవార్త**

నగరంలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో రోగుల భద్రత ప్రశ్నార్థకమే అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏడాది క్రితం వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చేపట్టిన తనిఖీల్లో మెజారిటీ ఆస్పత్రుల్లో అగ్నిమాపకశాఖ నిబంధనల ప్రకారం వసతులు లేవని తనిఖీ బృందాలు గుర్తించి నోటీసులు జారీ చేశాయి. ఆ తర్వాత రాజకీయ జోక్యం కారణంగా ఆయా ఆస్పత్రులపై చర్యలు నిలిచిపోయాయి. హైదరాబాద్ జిల్లా పరిధిలో ప్రభుత్వ గుర్తింపు ఉన్న అస్పత్రులు 2,500 ఉండగా 241 అస్పత్రులకు ఎలాంటి గుర్తింపు లేదు. వీటికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నోటీసులు సైతం జారీ చేశారు. రంగారెడ్డి జిల్లాలో సుమారు 2700 ప్రైవేట్ దవాఖానాలు ఉండగా వీటిలో 600కుపైగా అస్పత్రులకు ఎటువంటి గుర్తింపు లేదు. ఇరుకు గదులు, ఆపార్టుమెంట్‌లోని ప్లాట్లను అద్దెకు తీసుకుని యాజమాన్యాలు అస్పత్రులను నిర్వహిస్తున్నాయి. కొన్ని అస్పత్రులు ఆయుర్వేద వైద్యులు, ఆర్ఎంపీల పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. ఎమర్జెన్సీ విభాగాల్లో మెజార్టీ వైద్యులు ఆయుర్వేద వైద్యులే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తనిఖీల్లోనూ ఇదే అంశం బయటపడింది. తక్కువ వేతనాలకు పని చేస్తుండటంతో యాజమాన్యాలు కూడా వీరితోనే కాలం వెళ్లదీస్తున్నాయి. అధికారులు తాత్కాలికంగా తనిఖీలు చేయడం, వారి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేయడం జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పరిపాటిగా మారింది.

**మార్గదర్శకాలపై పట్టింపేదీ?**

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం ప్రతీ ఆస్పత్రికి ఫైర్ సేఫ్టీ అనుమతి తప్పనిసరి. ఆస్పత్రి ఆవరణలో ఫైర్ ఇంజిన్ చుట్టూ తిరిగే విధంగా రోడ్డు ఉండాలి.

– బహుళ అంతస్తుల భవనం ఎత్తును బట్టి రెండు గేట్లను ఏర్పాటు చేయాలి. ఏటా మాక్ డ్రిల్ నిర్వహించి ఆస్పత్రి సిబ్బందికి ఫైర్ సేఫ్టీపై అవగాహన కల్పించాలి.

– అస్పత్రి యాజమాన్యం ఒక్క బెడ్‌తో చికిత్స అందించినా. ఆ భవనానికి అగ్నిమాపక శాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సిందే. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం అగ్నిమాపక శాఖ అధికారులు ఆస్పత్రిని తనిఖీ చేసి అన్ని సవ్యంగా ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాతే నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) జారీ చేయాలి. కానీ జిల్లాలో ఏ ఒక్క ఆస్పత్రి కూడా నిబంధనల మేరకు ప్రకారం లేదు. అగ్నిమాపక శాఖ అధికారులు మాత్రం ఇవేవీ పట్టించుకోకుండా ఎన్ఓసీలు జారీ చేస్తున్నారు.

**ఎన్ఓసీ తప్పనిసరి..**

15 మీటర్ల కన్నా ఎక్కువ ఎత్తులో భవనం ఉంటే విధిగా జీహెచ్ఎంసీ, ఆయా మున్సిపాలిటీల నుంచి భవన నిర్మాణ అనుమతులతో పాటు అక్యుపెన్సీ సర్టిఫికెట్ పొందాలి. అగ్నిమాపకశాఖ నుంచి ఎన్ఓసీ తీసుకోవాలి. కోట్లాది రూపాయలు వెచ్చించి భవనాలు నిర్మిస్తున్న అన్నతులు ప్రమాదాల నియంత్రణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి.

**మాక్ డ్రిల్ చేయించాలి..**

– మూడు నెలలకోసారి అగ్నిమాక సిబ్బంది సహాయంతో ఆస్పత్రిలో ఎవాక్యుయేషన్ డ్రిల్ (ప్రమాదం జరిగినప్పుడు రోగులను బయటికి తరలించే ప్రక్రియ) నిర్వహించాలి. వంటగది. క్యాంటిన్ అస్పత్రి భవనంలో కాకుండా వేరే చోట ఏర్పాటు చేయాలి. కానీ మెజార్టీ అస్పత్రులు సెల్లార్లలోనే వంట గదులు, ఇన్‌పేషెంట్ పార్మసీ గోదాంలు, క్యాంటిన్ సహా కీలకమైన డయాగ్నోస్టిక్ (ఎక్స్ రే, సీటీ, ఎంఆర్ఐ రక్తనిధి కేంద్రం, రక్త, మూత్ర పరీక్షలకు సంబంధించిన ల్యాబ్) సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాయి.

– భవనంలో అంతస్తుల వారీగా కంపార్ట్‌మెంట్స్ ఏర్పాటు చేసి, ఒక బ్లాక్ నుంచి మరో బ్లాక్‌కు మంటలు వ్యాపించకుండా చూడాలి. ఆస్పత్రిలో వాడే గ్యాస్ నిల్వ చేయడంలో జాగ్రత్త వహించాలి. అత్యవసర ద్వారాలకు తాళాలు వేయకూడదు. బయటికి వెళ్లే మార్గాలపై సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ఫర్నిచర్, ఇతర వ్యర్థాలను అస్పత్రి ఆవరణలో నిల్వ చేయ కూడదు. ఎలక్ట్రికల్, ఏసీ, ఇతర విద్యుత్ ఉపకరణాల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి.

**నిర్వహణ గాలికి..**

ప్రతి గదిలోకి వెలుతురు 60ఉండేలా ఆస్పత్రిని నిర్మించాలి. ప్రమాదాలు నివారించే అన్ని ఉపకరణాలు కొనుగోలు చేయాలి. ఆపత్కాలంలో రోగులు త్వరగా బయటపడేందుకు అనువైన మెట్లు, లిఫ్టులు ఉండాలి. ఆటోమెటిక్ స్ప్రింక్లర్స్ సిస్టం, స్మోక్ డిటెక్టన్, వైట్ రైర్, మాన్యువల్ ఆపరేటింగ్ అలారం, టెర్రస్ ట్యాంక్, ఆండర్ గ్రౌండ్ వాటర్ స్టోరేజ్ ట్యాంక్, ఎలక్ట్రికల్ జాకీ పంపులు అందుబాటులో ఉంచాలి. కానీ మెజార్టీ అస్పత్రులు వీటిని ఏర్పాటు చేయడం లేదు. సమకూర్చిన ఆస్పత్రులు కూడా ఆ తర్వాత నిర్వహణను గాలి కొదిలేస్తున్నాయి.



హైదరాబాద్ వార్త

# మొన్న స్వరూప..నేడు 'మనీ'షా

**-జిహెచ్ఎంసిలో పెరిగిపోతున్న అవినీతి**
**-లంచాల కోసం కాంట్రాక్టర్లకు వేధింపులు**
**-వారం వ్యవధిలోనే పట్టుబడ్డ ఇద్దరు మహిళా ఇంజనీర్లు**
**-ఎసిబికి చిక్కేవారిలో ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్లే అధికం**



ఏసిబికి పట్టుబడ్డ ఏఈ మనిషా

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని అరికట్టేందుకు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఎన్ని దాడులు చేస్తున్నా.. కొందరు ఉద్యోగుల తీరులో మాత్రం మార్పు రావడం లేదు. ఉద్యోగం ప్రమాదంలో పడుతుందని తెలిసినా.. నైతిక విలువలను విస్మరించి లంచాలకు పాల్పడుతూనే ఉన్నారు. వారం రోజుల క్రితం జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నఅసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ) స్వరూప లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ కి చిక్కగా తాజాగా.. హైదరాబాద్‌లోని అంబర్‌పేట్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఒక ప్రభుత్వ అధికారిణి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే..అంబర్‌పేట్ జీహెచ్ఎంసీలో అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ)గా మనీషా పనిచేస్తోంది. ఒక కాంట్రాక్టర్ తన బిల్లుల మంజూరు కోసం మనీషాను సంప్రదించగా ఆబిల్లులను మంజూరు చేయడానికి మనీషా లంచం డిమాండ్ చేసింది. ఇప్పటికే కాంట్రాక్టర్ ఆమెకు రూ.5,000 చెల్లించాడు. ఒప్పందం ప్రకారం.. అదనంగా మరో రూ.15,000 ఇవ్వాలని మనీషా డిమాండ్ చేయడంతో.. బాధితుడైన కాంట్రాక్టర్ ఈ విషయాన్ని ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకువెళ్ళాడు. దీంతో ఫిర్యాదును స్వీకరించిన ఎసిబి ప్రణాళిక ప్రకారం అనుకున్న విధంగానే.. జీహెచ్ఎంసీ కార్యాలయంపై నిఘా ఉంచి, లంచం తీసుకుంటున్న సమయంలోనే మనీషాను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అలాగే గతనెలలో సికింద్రాబాద్ ప్రాంతీయ కార్యాలయంలో సహాయక టౌన్ ప్లానర్ బి. విఠల్ రావును సైతం ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. ఫిర్యాదుదారునికి చెందిన రెండు భవంతులకు సంబంధించిన ఆక్యుపెన్సీ ధ్రువీకరణ పత్రాలను అందించడానికి అధికారికంగా సహాయం చేసేందుకు ఎనిమిది లక్షల రూపాయల లంచం డిమాండ్ చేసి, అందులో అప్పటికే నాలుగు లక్షల రూపాయలు తీసుకున్నాడు. మిగిలిన నాలుగు లక్షల రూపాయల కోసం డిమాండ్ చేయడంతో సదరు భవన యజమాని ఏసీబీకి ఫిర్యాదుదారు చేశారు. దీంతో మిగిలిన డబ్బు ఇస్తుండగా ఆఅధికారిని ఏసీబీ అరెస్ట్ చేసింది. గత ఏప్రిల్ నెలలో శేరిలింగంపల్లి జోనల్ మున్సిపల్ కార్యాలయంలో అర్బన్ బయోడైవర్సిటీ డిప్యూటీడైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్ ఏసీబీ వలకు చిక్కారు. రూ.70 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. శ్రీనివాస్.. చార్మినార్ జోన్ ఇన్చార్జిగా అదనపు బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో చాంద్రాయణగుట్ట సర్కిల్లో అర్బన్ బయో డైవర్సిటీ వింగ్‌లో రూ. 45 లక్షల మొక్కల కాంట్రాక్టుకు సంబంధించిన బిల్లులను క్లియర్ చేయడానికి కాంట్రాక్టర్ దగ్గర నుంచి శ్రీనివాస్ రూ.2,20,000 లంచం డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా రూ.70,000 లంచం తీసుకుంటుండగా ఆయన్ని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గాపట్టుకున్నారు. అలాగే మార్చినెలలో కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ జీహెచ్ఎంసీ డిప్యూటీఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(డీఈఈ) దశరథ్ ఏసీబీ అధికారులకు చిక్కాడు. క్వాలిటీ క్లియరెన్స్ రిపోర్టు ఇచ్చేందుకు రూ.20 వేల లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. జీహెచ్ఎంసీ డివిజన్2లో ఓకాంట్రాక్టర్ రోడ్డు నిర్మించాడు. బిల్లుల చెల్లింపు కోసం బంజారాహిల్స్ డివిజన్ క్వాలిటీ కంట్రోల్ డీఈఈ దశరథ్ వద్దకు ఫైల్ వెళ్లింది. ఇందుకోసం దశరథ్.. ఆకాంట్రాక్టర్ ను రూ.30 వేల లంచం అడిగాడు. మొదటి విడతగా కాంట్రాక్టర్ వద్ద రూ.10 వేలు అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. క్వాలిటీ రిపోర్ట్ ఇచ్చే సమయంలో మిగతా డబ్బు ఇవ్వాలని సూచించాడు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. వారి సూచన మేరకు రూ.20 వేలు అందించగా, ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

## 120కిలోల గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న డిసిపి కోటిరెడ్డి తదితరులు

**దుండిగల్, జూన్ 23 ప్రభాతవార్త:** ప్రభుత్వ నిషేధిత గంజాయిని కారులో తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న మేడ్చల్ ఎస్‌వోటి పోలీసులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. కారులో పెద్దఎత్తున్న గంజాయి లభ్యమవడంతో నిందితున్ని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డిసిపి కోటిరెడ్డి వెల్లడించారు. గంజాయి వ్యాపారం చేస్తున్న ఓ ముఠా విశాఖపట్నం నుండి హైదరాబాద్ ఓఆర్ఆర్ మీదుగా హర్యానాకు అదివారం కారులో గంజాయి తరలిస్తున్నట్లు ఎస్‌వోటి పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో అదివారం దుండిగల్ వద్ద ఉన్న ఎగ్జిట్ నంబర్ 5 వద్ద పోలీసులు కాపుకాశారు. సాయంత్రం 4గంల సమయంలో టాటా నెక్సన్(ఏపి40డిఎం8365) రావడం గమనించి అడ్డుకున్నారు. పోలీసులను గమనించిన నిందితుడు పారిపోవడానికి ప్రయత్నించడంతో అతన్ని పట్టుకున్నారు. కారులో 43 గంజాయి ప్యాకేట్లు(120 కిలోలు) లభ్యమవడంతో నిందితున్ని అదుపులోకి తీసుకొని దుండిగల్ పోలీస్‌స్టేషన్ తరలించారు. కర్ణాటకలోని గుల్బర్గా ప్రాంతానికి చెందిన దేవ్‌రాజ్ అతని స్నేహితులు సాగర్‌పవార్, హనుమంత్‌పవార్, రాజ్‌కుమార్‌లతో కలసి కొంతకాలంగా గంజా వ్యాపారం నిర్వహిస్తున్నాడు. వీరు ఆంధ్రా నుండి హర్యాను తరలించి అక్కడి ప్రాంతానికి చెందిన బజరంగ్‌కు విక్రయిస్తుంటారని పోలీసుల విచారణలో నిందితుడు సాగర్‌పవార్ వెల్లడించారు. నేరం అంగీకరించడంతో కేసు నమోదు చేశారు. నిందితుడి వద్ద కారు, సెల్‌ఫోన్, గంజాయిని స్వాధీనం చేసుకొని సోమవారం రిమాండ్‌కు తరలించారు. పెద్ద ఎత్తున్న గంజాయిని పట్టుకున్నా ఎస్‌వోటి పోలీసులను డిసిపి అభినందించారు. సమావేశంలో ఎస్‌వోటి డిసిపి డి.శ్రీనివాస్, ఎస్‌వోటి ఎడిసిపి విశ్వప్రసాద్, మేడ్చల్ ఎసిపి శంకర్‌రెడ్డి, దుండిగల్ సిఐ సతీష్, ఎస్‌వోటి సిఐ శ్యామ్‌సుందర్‌రెడ్డి, డిఐ సతీష్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆడుకుంటూ చెరువులో పడి చిన్నారి మృతి ...

**ఆమెను కాపాడబోయి యువకుడు సైతం మృతి.**

**అబ్దుల్లాపూర్ మెట్, జూన్ 23 ప్రభాతవార్త :** చెరువు పక్కన ఉన్న బండరాయిపై ఆడుకుంటున్న ఓ చిన్నారి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందగా... ఆమెను రక్షించడానికి ప్రయత్నించిన మరో యువకుడు కూడా చెరువు లో మునిగి మృతి చెందిన సంఘటన అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల తెలిపిన కథనం ప్రకారం వివరాలు... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లాకు చెందిన చిన్నపురెడ్డి ప్రతాప్ రెడ్డి భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి అబ్దుల్లాపూర్ మెట్ లోని లక్ష్మీ ప్రియనగర్ కాలనీలో నివాసం ఉంతున్నాడు. ప్రస్తుతం అతను అనాజ్ పూర్ గ్రామ సమీపంలోని ఇందిరమ్మ చెరువు దగ్గర వెంచర్లో పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం ప్రతాప్ రెడ్డి అతని కూతురు ప్రణీత(10), బంధువులతో కలిసి వెంచర్ దగ్గరికి వెళ్ళాడు. వెంచర్ సమీపంలో ఉన్న ఇందిరమ్మ సాగర్ చెరువు వద్ద బండరాయిపై ఆడుకుంటున్న అతని కూతురు ప్రణీత ప్రమాదవశాత్తు చెరువులో పడి మునిగిపోయింది. ఈ విషయాన్ని గమనించిన ప్రతాపరెడ్డి బంధువు చింతం రెడ్డి ఇంద్రసేనారెడ్డి (20) ప్రణీతను కాపాడే ప్రయత్నంలో అతను కూడా చెరువులో మునిగి చనిపోయాడు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## వివాహిత ఆత్మహత్య

**జీడిమెట్ల, జూన్ 23 ప్రభాతవార్త**

ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మధ్యప్రదేశ్‌కు చెందిన సుదేపాండే (29) సునీల్ పాండే దంపతులు రాజీవ్ గాంధీ నగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, మృతుదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## చెరువులు.. నాలాల ఆక్రమణలు

**హైడ్రా ప్రజావాణికి 52 ఫిర్యాదులు**



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ రంగనాథ్ తదితరులు

**హైదరాబాద్, జూన్ 23,ప్రభాతవార్త:** చెరువులు, నాలాలు, పార్కుల ఆక్రమణలపై ఫిర్యాదులు కొనసాగుతున్నాయి. చెరువుల ఆక్రమణలతో పాటు.. కాలనీల్లో ఎంతో ముఖ్యంగా భావించే పార్కులను కూడా కబ్జా చేసి.. ప్లాట్లుగా విక్రయిస్తున్నారని పలువురు ఫిర్యాదు చేశారు. ఈమేరకు సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 52 ఫిర్యాదులు అందాయి. వరద కాలువలు అయితే 6 మీటర్ల మేర ఉండాల్సినవి కొన్ని ప్రాంతాల్లో కేవలం 2 మీటర్లకే పరిమితమయ్యాయనే ఫిర్యాదులు వచ్చాయి. చెరువులు అలుగులు పారే సమయంలో, 5 సెంటీమీటర్లకు పైగా వర్షం పడినప్పుడు కాలనీలు నీట మునగడం సర్వ సాధారణంగా మారాయని వాటిని కాపాడాలని ఫిర్యాదుల చేశారు. ఈసందర్భంగా హైడ్రా కమిషనర్‌రంగనాథ్ ఫిర్యాదులను గూగుల్ మ్యాప్స్ ద్వారా పరిశీలించడమే కాకుండా.. సంబంధిత అధికారులకు వాటిని అప్పగించి తదుపరి చర్యలకు ఆదేశించారు. మియాపూర్‌లోని హెచ్ఎంటీ స్వర్ణపురి కాలనీలో రహదారిని కబ్జా చేసి అడ్డుగా ప్రహరీ నిర్మించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ రోడ్డును తన పూర్వీకుల ఆస్తిగా పేర్కొంటూ తొమ్మిది నెలల క్రితం ప్రీకాస్ట్ వాల్ నిర్మించారు. అంతేకాకుండా, అక్కడ ఒక గదిని నిర్మించి అద్దెకు ఇచ్చినట్టు, అదనంగా తాత్కాలిక షెడ్‌లను కూడా ఒక మెకానిక్‌కి అద్దెకు ఇచ్చినట్టు నివాసితులు తెలిపారు. మేడ్చల్ జిల్లా అల్వాల్ పరిధిలోని రిట్రీట్ కాలనీలో నాలా ఆక్రమణ జరిగిందంటూ నివాసితులు ఫిర్యాదు చేశారు. లాయోలా కాలేజ్ సమీపంలో 12 అడుగుల నాలాపై ఓయో గదులు నిర్మించడంతో పాటు, బహుళ అంతస్తుల భవనం కూడా నిర్మించారని వారు తెలిపారు. నాలా ప్రవాహాన్ని అడ్డుకోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. శేరిలింగంపల్లి మండలం, కొండాపూర్‌లోని కాంతీవనం కాలనీలో 2220 గజాల పార్కును ఆక్రమించేందుకు కబ్జాదారులు ప్రయత్నిస్తున్నారని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌పేట్ మండలం, కొహెడ గ్రామ పరిధిలోని పిట్టె చెరువును మాయం చేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు.

## పాతబస్తీలో మొహర్రం ఊరేగింపు ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు



**యాకుత్‌పుర, జూన్ 25 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీలో జూలై నెల 6వ తేదీన డబీర్‌పురలోని బిబికాఆలం నుంచి చార్మినార్, గుల్జార్‌హౌస్, దారుఫిఫా ప్రాంతాలలో నిర్వహించనున్న మొహర్రం ఊరేగింపు ఏర్పాట్లను సోమవారం ఎంఐఎం శాసన సభ్యులు, దక్షిణ మండలం డిసిపి స్నేహా మెహ్రా, పలు ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొని పరిశీలించారు. మొహర్రం రోజున నిర్వహించనున్న ఊరేగింపు సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు కలగకుండ పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలని ఎంఐఎం శాసన సభ్యులు వాటర్ వర్క్స్, జిహెచ్ఎంసి, విద్యుత్ శాఖల అధికారులను ఆదేశించారు. మొహర్రం ఊరేగింపు జరిగే మార్గాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ, యాకుత్‌పుర ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, ఎమ్మెల్సీ మీర్జా రియాల్ ఉల్ హసన్ అఫెందీ, సౌత్ జోన్ డిసిపి స్నేహ మెహ్రా, చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్న, చార్మినార్ సిఐ చంద్రశేఖర్, ఫత్తర్‌గట్టి డివిజన్ కార్పొ రేటర్ సోహెల్ ఖాద్రిలు పాల్గొన్నారు.

## జిల్లాలో డయేరియాపై ప్రత్యేక ఫోకస్ పెట్టండి

**-స్కూళ్లు, కాలేజీలు, హాస్టళ్లలో నీటికాలుష్యం జరగకుండా చూడాలి -అధికారులకు జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ఆదేశం**




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన తదితరులు

**హైదరదాబాద్, జూన్ 23,ప్రభాతవార్త:** వర్షాకాలం నేపథ్యంలో హైదరాబాద్ జిల్లాలో డయేరియాపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి డాక్టర్లతోపాటు అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డయేరియా క్యాంపెయిన్ పై ఏర్పాటుచేసిన జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ 2014 నుండి అమలు చేస్తున్న ఇంటెన్సిఫైడ్ డయేరియా కంట్రోల్ ఫోర్ట్‌నైట్ (ఐడిసిఎఫ్)ను 2024 నుండి "స్టాప్ డయేరియా క్యాంపెయిన్"గా పునర్‌నామకరణ చేసి, ప్రతి సంవత్సరం జూన్ 16 నుండి జూలై 31 వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో డయేరియాకి రోక్‌థామ్, శుభ్రత, ఓఆర్ఎస్‌తో జాగ్రత్తగా ఉండు" అనే థీమ్‌తో స్టాప్ డయేరియా క్యాంపెయిన్-2025ను జిల్లా అంతట చేపట్టాలని గతంలో డయేరియా వచ్చిన చోట కూడా ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె వైద్యాధికారులకు సూచించారు. జాతీయ ఆరోగ్య విధానంలో ప్రధాన లక్ష్యం 5 సంవత్సరాల లోపు పిల్లల మృతిశాతం తగ్గించడమేనని అన్నారు. జిల్లాలో డయేరియా కారణంగా జరిగే మరణాలు ఇకపై ఒక్కటి కూడా ఉండకూడదని జిల్లా అంతట అనుబంధ శాఖల అధికారులతో వైద్యాధికారులు చేపట్టాలని ఆదేశించారు. డయేరియా వల్ల శరీర ద్రవాలు కోల్పోవడం, నీరసం, ఎలక్ట్రోలైట్ అసమతుల్యత ఏర్పడి మరణానికి దారి తీసే ప్రమాదం ఉందని, ఇది పూర్తిగా నివారించవచ్చని స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్య శాఖ జింక్ టాబ్లెట్లను అన్ని పాఠశాలలు, హాస్టల్స్, అంగన్వాడీలలో అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని అలాగే జిల్లా విద్యా అధికారి, సంక్షేమ శాఖల అధికారులు నిర్వహించే క్యాంపెయిన్ లో సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పాఠశాలలు, హాస్టల్స్‌లో పరిశుభ్రత, నీటి కాలుష్యం సంబంధించి ఎలాంటి లోపాలు కనిపించకూడదని, ఫుడ్ పాయిజనింగ్, డయేరియా ఘటనలు జరగకూడదని సూచించారు. పరిసరాలు పరిశుభ్రతతో పాటు క్లీన్ డ్రింకింగ్ వాటర్, చేతులు కడుకుట వంటి శుభ్రతా విషయాలపై ప్రజలలో అవగాహన కల్పించాలని, పోస్టర్ల ద్వారా ప్రచారం, పాఠశాలల కార్యక్రమాలు, బస్తీలలో, నాళాల పక్కన నివసించే ప్రజల మధ్య స్పెషల్ డ్రైవ్స్ నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, జిల్లా విద్యా అధికారి రోహిణి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీస్, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను బాధ్యతగా పరిశీలించి పరిష్కరించాలి

**-అధికారులకు జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణన్ ఆదేశం**

**హైదరాబాద్, జూన్ 23,ప్రభాతవార్త:** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను బాధ్యతతో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులకు సూచించారు. సోమవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి నగరంలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కమిషనర్ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్.వి.కర్ణన్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఒక్క ఫిర్యాదును ఆయా విభాగాల అధికారులు బాధ్యతతో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఫిర్యాదు ను క్షుణ్ణంగా పరిశీలన చేసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. వివిధ శాఖల మధ్య సమన్వయం మెరుగుపరుచుకుని ఒకే ఫిర్యాదు రిపీట్ కాకుండా నివారించాలని సూచించారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 78 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 45, ట్యాక్స్ సెక్షన్ 13, శానిటేషన్ 4, ఇంజనీరింగ్ విభాగం 3, హెచ్.ఎం.డబ్ల్యూ. ఎస్.ఎస్.బి 2, ల్యాండ్ అక్విజిషన్, ఫైనాన్స్, ఏ.సి లీగల్, విజిలెన్స్ విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందగా, ఫోన్ ఇన్ ద్వారా 7 ఫిర్యాదు అందింది.

**దోమల నివారణకు చర్యలు చేపట్టాలి: కమీషనర్ ఆర్.వి.కర్ణన్**

దోమల నివారణకు ముమ్మరంగా ఏ.ఎల్.ఓ కార్యక్రమాలు చేపట్టాలని కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. అడిషనల్, జోనల్ కమిషనర్ లు, ఆయా విభాగాల హెచ్.ఓ.డి లతో సోమవారం ఉదయం దోమల నివారణ, శానిటేషన్, కోర్టు కేసుల పై కమీషనర్ సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ... ఆయా జోన్ లలో ఎంటమాలజీలో పనిచేస్తున్న సిబ్బంది ఏ.ఎల్.ఓ కార్యక్రమాలు చేయకుండా ఇతర విధులు కేటాయించినట్లు తెలిసినందున వారిని ఏ.ఎల్.ఓ కార్యక్రమాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని జోనల్, డిప్యూటీ కమిషనర్లను ఆదేశించారు. చెరువుల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క వలన దోమల ఉత్పత్తి ఎక్కువయ్యే అవకాశం ఉంటుందని, గుర్రపు డెక్క తొలగింపునకు ప్రణాళిక తయారు చేయాలని అడిషనల్ కమీషనర్ లేక్స్, హెల్త్ ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఏ.సి శానిటేషన్ రఘు ప్రసాద్ మాట్లాడుతూ... ఈ నెల 3వ తేదీ నుండి 25 తేదీ వరకు ముందస్తు వర్షాకాలం శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ ఇప్పటి వరకు 120 వార్డులో పూర్తయ్యాయని, 3900 మెట్రిక్ టన్నుల సి అండ్ డి వేస్ట్, 5400 మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించినట్లు వివరించారు. ఒక్కొక్క వార్డులో ఇంకా మిగిలి పోయిన కాలనీల కోసం ఈ నెల 26వ తేదీ నుండి మరో 20 రోజుల పాటు అనుమతిస్తే నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ ను కోరారు.




ఫిర్యాదులను స్వీకరిస్తున్న కమిషనర్ ఆర్.వి కర్ణన్ తదితరులు

## కాలనీవాసులకు అందుబాటులో ఉండి అభివృద్ధి పనులు చేస్తా : కార్పొరేటర్ రాగుల



సి.సి.రోడ్డు నిర్మాణపు పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రాగుల

**వనస్థలిపురం. జూన్.23.ప్రభాతవార్త :** వనస్థలిపురం డివిజన్ లోని శ్రీశ్రీనివాసపురం కాలనీలో రూ.54 లక్షల వ్యయంతో నిర్మించనున్న సి.సి.రోడ్డు పనులకు స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర రెడ్డి కాలనీ ప్రతినిధుల తో కలిసి సోమవారం శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. నాణ్యత ప్రమాణాలతో రోడ్డు పనులు చేపట్టాలన్నారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు దూసరి మధుగౌడ్, పులి వేణు, లక్ష్మీనారాయణ, రాజేష్ గౌడ్, చిన్నా యాదవ్, శ్రీధర్‌రెడ్డి, పూర్ణ చందర్, సాయికిరణ్ పాల్గొన్నారు.

## ఆర్ కె నగర్‌లో సిసి రోడ్డు పనులు



**నేరెడ్‌మెట్, జూన్ 23,ప్రభాతవార్త**

మల్కాజ్గిరి డివిజన్ సమగ్ర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నట్లు డివిజన్ కార్పొరేటర్ వురవల్లి శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని ఆర్కే నగర్ లో 40 లక్షల వ్యయంతో చెప్పట్టిన సీసీ రోడ్డు పనులను అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్యాచ్ వర్క్స్ తరహాలో చెప్పటనున్న ఈ పనులలో ఆర్. కె నగర్, శ్రీకృష్ణ నగర్, బలరాంనగర్ తదితర కాలినీలలో మిగిలిన చిన్న ముక్కలను కూడా పూర్తి చేయడం జరుగుతుంది అని తెలిపారు. ఆర్. కే నగర్ లో దాదాపు సీసీ రోడ్లు పూర్తి అయ్యాయని అన్నారు.ఆర్ కె నగర్‌ను పూర్తి స్థాయిలో అభివృధి చేశామన్నారు.మరే చోటైనా జీహెచ్ ఎమ్‌సి పనులు కోరుకున్న వారు నేరుగా కార్పొరేటర్ శ్రవణ్‌ను కలిస్తే తప్పకుండ అవి కూడా పూర్తి చేస్తామని డివిజన్ ప్రజలను కోరారు. ఈ సందర్భంగా వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి పర్యటించిన శ్రవణ్ కు వాటర్ వర్క్స్ సమస్యలను స్థానికులు తెలుపగా వెంటనే తగిన చేర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం లో ఏ. ఈ నవీన్, రమేష్, వాటర్ వర్క్స్ మురళి, ఎస్ ఎఫ్ ఏ వసంత, గుత్తే దారుడు రవి, కాలనీ వాసులు ప్రభాకర్ శాస్త్రీ, హరినాథ్, పుల్లా రావు, సంపత్,వేణు, ప్రకాశన్ గణేశన్, శాస్త్రీ,సంపత్, మల్లేష్ బీజేపీ నాయకులు శ్రీధర్, హరీష్, నందు యాదవ్, సూరజ్ సింగ్, నాని, శ్రీనివాస్, వేణు యాదవ్ సాయి పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి - ఎమ్మెల్యే బలాల



ఓల్డ్ మలక్ పేట పద్మానగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బలాల తదితరులు

**మలక్ పేట జూన్ 23, ప్రభాతవార్త:**

ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తున్నామని మలక్ పేట్ నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. ఓల్డ్ మలక్ పేట డివిజన్ పద్మా నగర్ లో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. పద్మా నగర్ లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను, పెండింగ్ లో ఉన్న పనులను ఎమ్మెల్యే బలాల పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ వేగవంతంగా అభివృద్ధి పనులను పూర్తి చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సైపుద్దీన్ షఫీ, ఆలీం, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ నగర్‌లో మౌలిక వసతులు కల్పించాలి



**నేరెడ్ మెట్, జూన్ 23 ప్రభాతవార్త :** కాకతీయ నగర్ లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కి కాలనీవాసులు వినతి పత్రం అందించారు. వినాయక్ నగర్ డివిజన్ కాకతీయ నగర్ నార్త్ లోని స్మశాన వాటికలో నీటి సౌకర్యం లేదని బోర్ వేయించాలని, స్థానాల గదులు , మరుగుదొడ్లు నిర్మించాలని, వయోవృద్ధులకు కూర్చునేందుకు బెంచ్ లు ఏర్పాటు చేయాలని మౌలిక వసతులు కల్పించాలని అదేవిధంగా కాకతీయ నగర్ నార్త్ లో డ్రైనేజీ ఓవర్ ఫ్లోను నియంత్రించడానికి భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఆధునికరించాలని ఎమ్మెల్యే కు కాకతీయ నగర్ వాసులు వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాకతీయ నగర్ వాసులు ప్రభాకర్ రెడ్డి, గోపాల్, కొమురయ్య , వెంకటాచారి, సత్యనారాయణ, అజయ్, కవిత తదితరులు పాల్గొన్నారు.



తుర్కయంజాల్ మున్సిపాలిటీలో గల పోచమ్మ గుడి ఆవరణలో రాష్ట్ర ఎస్సీ మోర్చా నాయకులు బచ్చిగళ్ళ రమేష్ ఆధ్వర్యంలో మొక్కలు నాటుతున్న బిజెపి నేతలు

## డ్రగ్స్ వాడొద్దు ప్రాణాల మీదకు తెచ్చుకోకండి : సిఐ గోవిందరెడ్డి

**మేడిపల్లి ,జూన్ 23 ప్రభాతవార్త ;** రాచకొండ పోలీస్ కమిషనరేట్ మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని విజన్ జూనియర్ మరియు డిగ్రీ కళాశాలలో మేడిపల్లి పోలీసుల ఆధ్వర్యంలో నార్కోటిక్స్ డిపార్ట్మెంట్ సంయుక్తంగా ఆంటీ డ్రగ్ అవేర్నెస్ వీక్25 లో భాగంగా విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఇన్స్పెక్టర్ ఆర్. గోవిందరెడ్డి మాట్లాడుతూ.. డ్రగ్ విద్యార్థుల జీవితాన్ని, కుటుంబాలను నాశనం చేస్తుందని, ఎట్టి పరిస్థితుల్లో డ్రగ్స్ జోలికి వెళ్లకూడదని , మత్తుతో యువత జీవితాన్ని చిత్తు చేసుకోవద్దని, విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, చెడు వ్యసనాలకు బానిస కావద్దని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, లోన్ యాప్స్ లో అప్పు తీసుకోకూడదని సైబర్ నేరాలకు ముఖ్య కారణం ఒకటి అత్యాశ రెండు అమాయకత్వం ఈ రెండు కారణాలవల్ల సైబర్ నేరాలు జరుగుతాయని ఏదైనా సైబర్ నేరాలకు గురి అయితే వెంటనే డయల్ 1930 కు కాల్ చేయాలని సూచించారు . మైనర్లు 18 సంవత్సరాల లోపు వయసుగల వారి , లైసెన్సు లేకుండా ఎట్టి పరిస్థితిలో వాహనాలు నడపకూడదని, రోడ్డు ప్రమాదాల బారిన పడకూడదని ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నార్కోటిక్స్ ఇన్స్పెక్టర్ రాంప్రసాద్ మాట్లాడుతూ.. డ్రగ్స్ మత్తులో యువత బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటుందని, డ్రగ్స్ జోలికి వెళ్లకూడదని చట్టాలు కఠినంగా ఉన్నాయని, తెలంగాణ రాష్ట్రంలో డ్రగ్ మహమ్మారిని తరిమికొట్టాలని , డ్రగ్ రహిత సమాజం కోసం విద్యార్థులు పాటుపడాలని సమాజ హితం కోసం కృషి చేయాలని, ప్రతి ఒక్క విద్యార్థి ఆంటీ డ్రగ్ సోల్జర్ గా మారాలని డ్రగ్స్ కు సంబంధించి ఎలాంటి అత్యవసరం ఉన్న, ముందస్తు సమాచారం ఉన్న వెంటనే ( టీజీ ఎన్ ఏ బి ) కి సమాచారం డయల్ 1908 ద్వారా అందించాలని చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా డ్రగ్ రహిత సమాజం కోసం విద్యార్థుల చేత మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు కృష్ణయ్య గౌడ్ , ఉదయ భాస్కర్ శివ కుమార్ , కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్ , ప్రిన్సిపల్ రమాకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉప్పల్ డిపో విజన్ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న సీఐ గోవిందరెడ్డి ,ఎస్సై కిష్టయ్య గౌడ్ ,కళాశాల విద్యార్థులు

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి : విజయసింహారెడ్డి

**మలక్ పేట ,జూన్ 23, ప్రభాతవార్త:** మలక్ పేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ముసారంబాగ్ డివిజన్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ జిల్లా పార్టీ పరిశీలకులు, టీ పీసీసీ ఉపాధ్యక్షుడు సురేష్ కుమార్ , సుబ్రహ్మణ్య ప్రసాద్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు బూత్, డివిజన్, బ్లాక్ కమిటీల ఏర్పాటు ప్రక్రియ లో భాగంగా డివిజన్ స్థాయిలో కార్యకర్తల వివరాలు సమీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలు విజయవంతం చేసే దిశగా కార్యకర్తలు పని చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రజలందరికీ చేరే విధంగా చూడాలని కోరారు. సమీకరించిన వివరాలను టీ పీసీసీ అధిష్టానానికి అందజేయడం జరుగుతుందని , నియోజకవర్గం పరిధిలోని అన్ని డివిజన్, బ్లాక్ కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని వివరించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు మందడి విజయసింహారెడ్డి మాట్లాడుతూ మలక్ పేట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మలక్ పేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ



కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహిస్తున్న మందడి విజయసింహారెడ్డి, పార్టీ పరిశీలకులు సురేష్ కుమార్, సుబ్రహ్మణ్య ప్రసాద్ , షేక్ అక్బర్ తదితరులు

ఇంఛార్జి షేక్ అక్బర్, నాయకులు ఎజాజ్ ఖాన్ , బద్దం సురేందర్ రెడ్డి, చిట్టంపల్లి కిరణ్ కుమార్, శ్యామ్ రావు, బట్టు దాసు రావు, అశ్వక్ ఖాన్, ధర్మేందర్, చందు నాయక్, బొట్టు శ్రీను, గంట సుదర్శన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## సాయినాథ పురం ప్రధాన రహదారి పక్కన అనుమతులు లేని రేకుల షెడ్డు

-చోద్యం చూస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు
-ఫిర్యాదు చేసిన స్పందించని మల్కాజిగిరి టౌన్ ప్లానింగ్ యంత్రాంగం

**నేరెడ్ మెట్, జూన్ 23, ప్రభాతవార్త**

మల్కాజ్గిరి సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా యదేచ్చగా రేకుల షెడ్డు నిర్మాణాన్ని కొనసాగిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు నిమ్మకు నీలెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానిక కాలనీవాసులు పేర్కొంటున్నారు. మల్కాజ్గిరి సర్కిల్ పరిధిలోని మోలాలి డివిజన్ సాయినాథపురంలో ప్రధాన రోడ్డు ఫుట్పాత్ భాగం లో రేగుల షెడ్డును అక్రమంగా నిర్మిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగంలో ఉంటూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ అక్రమ షెడ్డు నిర్మాణం చేపట్టే వాటిపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటూ స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు,కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఈ కమర్షియల్ అక్రమ షెడ్డు నిర్మాణం వల్ల వాహనదారులకు,పాదాచారుల కు తీవ్ర ఇబ్బందులు కలిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్డు ను తొలగించి వాహనదారుల సమస్య పరిష్కరించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను స్థానిక కాలనీవాసులు కోరుతున్నారు. మల్కాజ్గిరి టౌన్ ప్లానింగ్ అధికారులు దీనిపై చర్యలు తీసుకోకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని కాలనీవాసులు పేర్కొంటున్నారు.



## 26న శ్రీ కనకాల కట్టమైసమ్మ అమ్మవారికి కుమ్మరుల తొలిబోనం జాతర

**సైదాబాద్, జూన్ 22 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26 తేది గురువారం లోయర్ ట్యాంక్ బండ్‌లోని శ్రీ కనకాల కట్ట మైసమ్మ అమ్మవారి తొలిబోనం జాతరను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలంగాణ కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడికుడ జయంత్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజ్‌గిరి దయానంద్‌లు తెలిపారు. కర్మన్‌ఘాట్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీన 501 బోనాలతో పోతరాజులు, శివసత్తుల ఆటపాటలు, మంగళవాయిద్యాలతో జగదీష్ మందిర్ నుంచి ట్యాంక్ బండ్ మీదుగా భారీ శోభాయాత్రగా తరలివెళ్లి శ్రీ కనకాల కట్ట మైసమ్మకు కుమ్మరుల ఆధ్వర్యంలో తొలిబోనం సమర్పించడం జరుగుతుందన్నారు. బోనాల పండుగ సందర్భంగా కొత్త మట్టి కుండల్లోనే అమ్మవారికి నైవేద్యం సమర్పించాలని, ప్లాస్టిక్, స్టీల్, ఇతర రకాలైన పాత్రలను ఎట్టి పరిస్థితిలో ఉపయోగించకూడదన్నారు. గ్రామాల్లోని గ్రామ దేవతలకు కుమ్మరులే పూజారులుగా ఉంటారని, వారిని ప్రభుత్వ పరంగా పూజారులుగా గుర్తిస్తూ పారితోషికం ఇవ్వాలని, దూప దీప నైవేద్యానికి గ్రామ దేవతల ఆలయాలకు నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆరోగ్యానికి మేలు చేసే మట్టి పాత్రల వినియోగం గురించి శాసనసభలో ప్రభుత్వం ప్రకటన చేయాలన్నారు. కుమ్మర బంధు పథకాన్ని ప్రకటించి, కుమ్మర వృత్తి దారులకు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని వారు పేర్కొన్నారు. కుమ్మరులందరు కుటుంబ సమేతంగా తొలిబోనం జాతరకు హాజరుకావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బోనాల ఉత్సవ కమిటీ కన్వీనర్ రామన్‌కోల్ ప్రభాకర్, కో కన్వీనర్ ఏడుకొండల వెంకటేషం, రాష్ట్ర కోశాధికారి ఆమంచి రాజలింగం, ఉత్సవ కమిటీ సలహాదారులు రామన్‌కోల్ వీరేషం, నాగపురి నాగేష్, ఎగిరిశెట్టి వీరయ్య, రాష్ట్ర నాయకులు రాచకొండ కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడికుడ జయంత్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజ్‌గిరి దయానంద్‌లు

## చిరస్మరణీయుడు జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ: అందెల

**సరూర్‌నగర్, జూన్ 23 ప్రభాతవార్త:** భారతదేశంలో ఒకే జెండా ఒకే రాజ్యాంగం ఉండాలని పరితపించి ఆర్టికల్ 370 రద్దు కోసం బలిదానం అయిన చిరస్మరణీయుడు భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలో కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు పసునూరి బిక్షపతిచారి, తులసి ముఖేష్ ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో సోమవారం జరిగిన శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడి ఇచ్చిన పిలువు మేరకు లక్ష మొక్కలు నాటు కార్యక్రమంలో భాగంగా నందిహిల్స్, జిల్లెలగూడల్లో పార్టీ నేతలతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ కౌన్సిల్ మెంబర్ కోడూరు సోమేశ్వర్, గాజుల మధు, బడంగ్‌పేట్ మాజీ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, ఏనుగు ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు సూల ప్రభాకర్, జగన్, వేణుగోపాల్‌రెడ్డి, కసిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వలభోజు గోపినాథ్, తుమ్మల రమేష్ ముదిరాజ్, ఆవుల సత్తయ్య, మెకం సుధాకర్ నేత, సిద్దాల శ్రీనివాస్, హైందవి, రాజ్‌పుత్ రజని, కిశోర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు. అదే విధంగా రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి సైతం హాజరై మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కీసర గోవర్ధన్‌రెడ్డి, పెండ్యాల నర్సింహ, కీసర హరినాథ్‌రెడ్డి, భీమ్‌రాజ్‌లతో పాటు చీలంపల్లి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా మీర్‌పేట్ కార్పొరేషన్‌లో మొక్కలు నాటుతున్న అందెల శ్రీరాములు యాదవ్

**బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో..**

శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా బడంగ్‌పేట్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, రామిడి వీరకర్ణారెడ్డిల ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమానికి హాజరైన అందెల శ్రీరాములు యాదవ్ ముఖర్జీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించిన అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం మల్లారెడ్డి, ఏనుగు ప్రభాకర్‌రెడ్డి, చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రామిడి శూరకర్ణారెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, రామిడి మహేందర్‌రెడ్డి, సామ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## బిసిల ఐక్యతతోనే రాజ్యాధికారం : కటకం



సమావేశంలో మాట్లాడుతున్న కటకం నర్సింగరావు

**ఎల్.బి.నగర్, జూన్ 23 ప్రభాతవార్త:** బీసీల ఐక్యత ద్వారానే రాజ్యాధికారం సాధించవచ్చని మన ఆలోచన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నర్సింగరావు పేర్కొన్నారు. మన ఆలోచన సాధన సమితి (మాస్) మొదటి రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు కటకం నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో నాగోల్‌లోని మాస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు గడ్డం నరసింహగౌడ్, దింత ఆనందం, పూస నరసింహబెస్త, నేరెళ్ల దేవేందర్‌లు హాజరై రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కటకం నర్సింగ్‌రావు మాట్లాడుతూ గ్రామాలలో అనైక్యతగా ఉన్న బీసీ (కులవృత్తులు చేసుకునే) కులాలు మధ్య సఖ్యత, సామాజిక, ఆర్థిక, రాజకీయ, చైతన్యం తీసుక రావడానికి మాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నెల రోజులపాటు మొదటి విడత గ్రామబాట కార్యక్రమాన్ని నిర్వహించి తెలంగాణ వ్యాప్తంగా మాస్ జెండాలను ఆవిష్కరించడం పట్ల సభ్యులను అభినందించారు. మాస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాల ద్వారా ఆకర్షితులై పెద్ద ఎత్తున వచ్చిన బీసీ యువకులకు, నాయకులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కోరంగి దుర్గరాణిరజక, గుండ్ల ఆంజనేయులుగౌడ్, గుంటిపాటిపూసల, విద్యాసాగర్‌ముదిరాజ్, పంతంగి విటలయ్యగౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, బచ్చనబోయిన శ్రీనివాసులుయాదవ్, గోదా మల్లికార్జున్‌గౌడ్, కార్యదర్శులు గౌటి రమాదేవి, గాది కృష్ణయ్య నాయి, పన్నీరు సత్యంపూసల, వట్టిపల్లి వెంకటేష్‌రజక, ఆర్గనైజింగ్ కార్యదర్శులు, నక్క కాశీనాథ్‌నేత, చుక్కల సత్యనారాయణగంగపుత్ర, ప్రచార కార్యదర్శిలు, పెద్దవూర బ్రహ్మయ్యరజక తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి



ప్రదర్శనలో పాల్గొన్న ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జూన్ 23 ప్రభాతవార్త:** వర్షాకాలం నేపథ్యంలో పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకుని సోమవారం గడ్డిఅన్నారం డివిజన్ వివేకానందనగర్‌లో జిహెచ్‌ఎంసి శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని కార్పొరేటర్, శానిటేషన్ డిఈ చందనతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. కాలనీలో పేరుకుపోయిన మట్టికుప్పలు, రోడ్లు శుభ్రం చేయడం, చెత్తకుప్పలను తొలగించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి సిబ్బంది బుచ్చయ్య, శ్రీనివాస్‌రెడ్డి, యాకయ్య, జోష్నా, పండు, కాలనీవాసులు యదు మోహన్, కిషన్, శ్యామ్, బీజేపీ డివిజన్ అధ్యక్షులు దాసరి జయప్రకాష్, ఏనుగు శ్రీధర్‌రెడ్డి, సిరిరెడ్డి, గిరీష్, టీంకు పాల్గొన్నారు.

## కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం ధర్మకర్తగా రాజేశ్వరి



టిపిసిసి ప్రచార కమిటి చైర్మన్ మధుయాష్కీ గౌడ్‌తో నూతన ధర్మకర్త ముద్ద రాజేశ్వరి

**సైదాబాద్, జూన్ 22 ప్రభాతవార్త:** చారిత్రక నేపథ్యం కలిగిన కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం పాలకమండలి నూతన ధర్మకర్తగా చంపాపేట దుర్గాభవానినగర్‌కు చెందిన ముద్ద రాజేశ్వరి ప్రమాణ స్వీకారం చేశారు. దేవాలయ కార్యనిర్వాహణాధికారి ఎన్.లావణ్య, టిపిసిసి ప్రచార కమిటి చైర్మన్ మధుయాష్కీ గౌడ్‌ల సమక్షంలో దేవాదాయ శాఖ పరిశీలకులు ప్రణీత్ కుమార్ సోమవారం నూతన ధర్మకర్తగా ముద్ద రాజేశ్వరి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా టిపిసిసి ప్రచార కమిటి చైర్మన్ మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి తన పూర్తి సహకారం అందిస్తానని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. నూతన ధర్మకర్త ముద్ద రాజేశ్వరి మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి, భక్తులకు కావాల్సిన సదుపాయాలు కల్పించడానికి పాలకమండలితో కలిసి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ పాలక మండలి చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, ముద్ద రాజేశ్వరి కుమారులు మాజీ ధర్మకర్త ముద్ద కళ్యాణ్ చక్రవర్తి, మాజీ కార్పొరేటర్ ముద్ద పవన్, ధర్మకర్తలు పూల నాగరాజు, దుర్గారెడ్డి, ప్రవీణ్‌గౌడ్, తోకటి కిరణ్, శ్రీనివాస్‌గౌడ్, కవిత, నరేష్, సంతోష్, శ్రీనివాస్, దేవాలయ సిబ్బంది వెంకటయ్య, రమాదేవి, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## దేశ సమగ్రత కోసం ప్రాణాలర్పించిన ముఖర్జీ -ఎంపీ ఈటల రాజేందర్



ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఈటెల రాజేందర్, కార్పొరేటర్లు

**ఎల్.బి.నగర్, జూన్ 23 ప్రభాతవార్త:** డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ దేశ సమగ్రత, ఏకతా కోసం తన ప్రాణాలు అర్పించిన మహాత్ముడని మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. నాగోల్ బీజేపీ పార్టీ కార్యాలయంలో సోమవారం డాక్టర్ శ్యామ్ ప్రసాద్‌ముఖర్జీ బలిదాన్ దివస్ కార్యక్రమం నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్ నిర్వహించగా ఈటల రాజేందర్ హాజరై ముఖర్జీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు సామ రంగారెడ్డి, జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, నాగోల్ డివిజన్ బిజెపి పార్టీ అధ్యక్షులు ఫంగ శ్రీకాంత్, నాయకులు సిద్ధల ఐలయ్య, పంగ శ్యామ్‌కుమార్. నూకల పద్మారెడ్డి, రేణుక, సరస్వతి, సంజీవరెడ్డి, మునీందర్, కన్నయాదవ్, నరేష్‌యాదవ్, రాము, శివ, సంతోష్ పాల్గొన్నారు.

## పనిచేసే ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీలో గుర్తింపు

న-మలక్‌పేట ఇంఛార్జి షేక్ అక్బర్



సమావేశంలో మాట్లాడుతున్న మలక్‌పేట కాంగ్రెస్ ఇంఛార్జి షేక్ అక్బర్

**సైదాబాద్, జూన్ 22 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం సాయంత్రం బి బ్లాక్ అధ్యక్షుడు ఆమిందాల మదన్‌బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మలక్‌పేట ఇంఛార్జి షేక్ అక్బర్, నియోజకవర్గ పరిశీలకులు సుబ్రమణ్యం, సురేష్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని బూత్ లెవల్ నుంచి మరింత బలోపేతం చేయాలని, రాబోయే జిహెచ్‌ఎంసి ఎన్నికలకు సన్నద్ధం కావాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం గురించి తెలియజేయాలన్నారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, పనిచేసే కార్యకర్తలను పార్టీ తప్పని సరిగా గుర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నా యకులు బొల్లు కిషన్, బాలకృష్ణ యాదవ్, గంట్ల కృష్ణ, రాములరావు, కావేటి శ్రీకాంత్, రవీందర్, అనూప్ పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్ నగర బ్రాహ్మణ సేవా సంఘం మహిళా కమిటీ ఎన్నిక



ఎమ్మెల్సీ సురభి వాణిదేవితో బడంగ్‌పేట్ నగర బ్రాహ్మణ సేవా సంఘం మహిళా కమిటీ నూతన కార్యవర్గం

**సరూర్‌నగర్, జూన్ 23 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ నగర బ్రాహ్మణ సేవా సంఘం మహిళా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. అల్మాస్‌గూడలోని వర్షిణి ఫంక్షన్ హాల్‌లో నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు మంగు రాఘవరావు, కోశాధికారి బల్లమూడి రాంబాబు, కార్యవర్గం సహకారంతో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, బ్రాహ్మణ ఆర్గనైజేషన్ ఫర్ సోషల్ సర్వీస్ కన్వీనర్ బసవరాజ్ శ్రీనివాస్, టిబిఎస్ఎస్ఎస్ ఛైర్మన్ వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ పంతంగి మాధవి వెంకటేశ్వరరావు తదితరుల సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ మేరకు సంఘం గౌరవాధ్యక్షురాలిగా ఆకెళ్ల అనూరాధ, అధ్యక్షురాలిగా సుధారాణి కృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శిగా మైథిలి, ఉపాధ్యక్షులుగా మందా రాజేశ్వరి, నవీన జ్యోతి, తమ్మారి గోటి ఇందిర, కార్యదర్శులుగా చౌద్రాజు శిరీష, రాంబట్ల పద్మావతి, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఇంగువ సావిత్రి, సాంస్కృతిక కార్యదర్శిగా పావని, కార్యవర్గ సభ్యులుగా బొల్ల నిఖిల, వరలక్ష్మిలు ఎన్నికయ్యారు. ఎన్నిక అనంతరం ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన బ్రాహ్మణ విద్యార్థులను ఎమ్మెల్సీ సురభి వాణి దేవి చేతుల మీదుగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

## ప్రాసనయనేయ స్వామి ఆలయ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన ఆలయ నూతన కమిటీని సన్మానించిన వంటేరు నర్సింహారెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, జూన్ 23 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ శ్రీ ప్రాసనయనేయ స్వామి దేవాలయ అధ్యక్షునిగా బి.భాస్కర్, ఉపాధ్యక్షునిగా విక్రమ్, ప్రధాన కార్యదర్శిగా భరత్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.రామకృష్ణ, కోశాధికారులుగా రంగనాయకులు, రజని, సభ్యులుగా సునంద, నాగశ్రీ, హరి ప్రకాశ్, భాస్కర్, శ్రవణ్, యశ్వంత్ తేజలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా స్థానిక న్యూ గాయత్రీనగర్ ఫేజ్-2 వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన కమిటీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు వంటేరు నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి సి. అనంత్‌రెడ్డి, ఆలయ మాజీ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, మాజీ ప్రధాన కార్యదర్శి సుధాకర్, మాజీ కోశాధికారి పండారయ్య తదితరులు పాల్గొన్నారు.

## వీరబద్రియ సంఘం కేంద్రం కమిటీ నూతన అధ్యక్షుడిగా చెవ్వ కొండయ్య

**మలక్ పేట ,జూన్ 23, ప్రభాతవార్త:**

వీరభద్రియ (వీర ముష్టి )సంఘం కేంద్ర కమిటీ నూతన అధ్యక్షుడీగా చెవ్వ కొండయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలంగాణ వీరభద్రియ(వీర ముష్టి) సంఘం కేంద్ర కమిటీ సర్వసభ్య సమావేశం నగరంలోని ముసారాంబాగ్ లో నిర్వహించారు. ఈ సమావేశానికి కేంద్ర సంఘం అధ్యక్షులు కాటపల్లి వీరస్వామి అధ్యక్షత వహించగా జాతీయ సంఘం అధ్యక్షులు కాటపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. కేంద్ర సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించడానికి పొన్నాల నరహరిని ఎన్నికల కమిటీ చైర్మన్ గా నియమించారు. అనంతరం జిల్లా, స్థానిక సంఘాల ప్రతినిధులతో, ఎన్నికల కమిటీ సమావేశం తో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేయడం జరిగింది. అధ్యక్షుడిగా చెవ్వ కొండయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా కాటపల్లి బిక్షపతి, మిట్టపల్లి పోచయ్య, ప్రధాన కార్యదర్శిగా చెవ్వా శ్రీనివాస్, కోశాధికారిగా కాటపల్లి రవికుమార్ లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా నాయకత్వంపై నమ్మకం ఉంచిన ప్రతి ఒక్కరికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు. వీరభద్రియ(వీరముష్టి) కుల సంఘం అభివృద్ధే మా లక్ష్యమని, త్వరలో పూర్తి కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి కేంద్ర సంఘం విధి, విధానాలను ఖరారు చేస్తామ ని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అనుబంధ సంఘాలు, ప్రతినిధులతో కలిసి కుల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.